శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

జిల్లా రెడ్‌క్రాస్ ఇన్‌ఛార్జి ఛైర్మన్ జె.సత్యనారాయణరాజు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక పత్తేబాద్‌లో నిర్వహిస్తున్న ఎఎన్ఎం నర్సింగ్ మహిళా శిక్షణ కళాశాలలో రెండేళ్ల కోర్సుకు ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థినుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా రెడ్‌క్రాస్ ఇన్‌ఛార్జి ఛైర్మన్ జె.సత్యనారాయణరాజు ఒక ప్రకటనలో తెలిపారు. కొల్లేరు, గిరిజన, గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేద విద్యార్థినులకు ప్రాధాన్యం ఉంటుందని, ఉచిత భోజన వసతి సదుపాయం కల్పించి శిక్షణ ఇస్తున్నారని పేర్కొన్నారు. ఇంటర్ పూర్తి చేసిన ఏ గ్రూపు వారైనా కూడా దరఖాస్తు చేసుకోవచ్చని, సెప్టెంబర్ 30లోగా దరఖాస్తులు అందజేయాలని కోరారు. మరిన్ని వివరాలకు 9493056864, 9494239823 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

గోదారమ్మ దోబూచులాట

తగ్గినట్లే తగ్గి మళ్లీ పెరుగుతున్న గోదావరి వరద

ఇంకా ముంపులోనే గుండేటి వాగు కాజ్వే

భద్రాచలంలో మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయికి గోదావరి

కుక్కునూరు రూరల్: దాచారం మార్గంలో రోడ్డుపైకి చేరిన వరద నీరు

ప్రజాశక్తి - కుక్కునూరు రూరల్

గోదారమ్మ విలీన గ్రామాల ప్రజలతోపాటు లంక గ్రామాల ప్రజలతో దోబూచులాడుతోంది. తగ్గినట్లే తగ్గిన గోదావరి వరద ఒక్కసారిగా అనూహ్యంగా పెరుగుతోంది. ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రాజెక్టుల్లో సామర్థ్యానికి మించి ఉన్న నీటిని దిగువకు విడుదల చేస్తుండటంతో గోదావరికి భారీగా వరద నీరు పోటెత్తుతోంది. శుక్రవారం ఉదయం భద్రాచలంలో 35 అడుగులు ఉన్న గోదావరి వరద సాయంత్రానికి 42.20 అడుగులకు చేరుకుని మొదటి ప్రమాద హెచ్చరికకు చేరువలో ఉంది. ఇప్పటికే కుక్కునూరు, దాచారం మధ్య గుండేటి వాగు కాజ్వే ముంపులోనే ఉండటంతో వాగు అవతల ఉన్న గ్రామాలకు రాకపోకలు పునరుద్ధరణ కాలేదు. భద్రాచలంలో గంటగంటకు గోదావరి వరద పెరుగుతుండటంతో ముత్యాలంపాడు, వింజరం మధ్య పాలవాగు కాజ్వేపైకి వరద నీరు చేరితే మరో మూడు గ్రామాలకు రాకపోకలు నిలిచే ప్రమాదం ఉంది. వరద పెరుగుతుండటంతో ముంపు మండలాల ప్రజలు కంటి మీద కునుకు లేకుండా బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు.

వేలేరుపాడు రూరల్: గోదావరికి వరద పోటెత్తడంతో లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం శుక్రవారం ఉదయం నుంచి గంట గంటకు పెరుగుతూ సాయంత్రానికి 42 అడుగులు దాటడంతో మండలంలోని ప్రజలు భయం గుప్పెట్లో కొట్టుమిట్టాడుతున్నారు. శ్రీరామ్‌సాగర్, మేడిగడ్డ తదితర ప్రాజెక్టుల నుంచి వరద నీరు విడుదలవుతుండటంతో గోదావరి నీటిమట్టం 50 అడుగుల వరకూ వచ్చే అవకాశం ఉందని, గోదావరి పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ఇప్పటికే వేలేరుపాడు నుంచి రుద్రంకోట, కొయిదా వెళ్లే మార్గంలోని యడవల్లి వద్ద ఉన్న ఎద్దువాగు కాజ్వే మునిగిపోవడంతో కోయిదా, కట్కూరు, కాకిసినూరు, టేకూరు, తాళ్లగొంది, పూచిగొంది తదితర సుమారు 18 గ్రామాలకు రహదారులు దిగ్బంధమై రాకపోకలు నిలిచిపోయాయి.

వేలేరుపాడు రూరల్: ఎద్దు వాగు పొంగడంతో ముంపులో కాజ్వే

పరీక్ష రాస్తే ప్రభుత్వ ఉద్యోగం పట్టాల్సిందే

డిఎస్‌సిలో సత్తా చాటిన సుజనా కుమారి

ఒకేసారి స్కూల్ అసిస్టెంట్, టిజిటి ఉపాధ్యాయినిగా ఎంపిక

ఇప్పటికే గ్రామ సచివాలయంలో మహిళా పోలీస్‌గా విధులు

2016 నుంచి ఇప్పటి వరకూ నాలుగు ప్రభుత్వ కొలువులకు ఎంపిక

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఈ కాలంలో ప్రభుత్వ కొలువు సాధించడమంటే ఆషామాషీ కాదు. ఏళ్ల తరబడి కోచింగ్ సెంటర్లలో చేరి పడిగాపులు పడినా కొలువు వస్తుందో లేదో తెలియదు. ప్రభుత్వ కొలువు సాధించడం అనేది ఎంతోమంది కలగా ఉంటుంది. అలాంటిది డిఎస్‌సి పరీక్షల్లో ఒకేసారి రెండు కొలువులు సాధిస్తే ఏవిధంగా ఉంటుందో ఆ కుటుంబ సభ్యుల ఆనందాన్ని మాటల్లో చెప్పడం కష్టమే. మండల కేంద్రం గణపవరానికి చెందిన సుజనా కుమారి డిఎస్‌సిలో స్కూల్ అసిస్టెంట్, టిజిటి (ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్) రెండు ఉద్యోగాలకు ఎంపికై తన సత్తా ఏమిటో మరోసారి నిరూపించుకుంది. సుజనా కుమారి 2016 నుంచి ఇప్పటి వరకూ నాలుగుసార్లు ప్రభుత్వ ఉద్యోగం కోసం పరీక్షలు రాయగా రాసిన ప్రతిసారీ ఆమె కొలువు సాధించడం గమనార్హం. గ్రామీణ వాతావరణంలో పుట్టి పెరిగిన సుజనా కుమారి ప్రభుత్వ కొలువుల పోటీలో అంతా ఔరా అన్పించేలా ప్రతిభ కనబరుస్తూ వస్తోంది. సుజనాకుమారి 2016లో మొదటిసారిగా ఆక్వా కల్చర్‌లో కీలకపాత్ర పోషించే కేంద్ర ప్రభుత్వ సంస్థకు సంబంధించిన పరీక్ష రాసి భీమవరంలోని ఎంపెడాలో తొలిసారి ఉద్యోగం సాధించింది. ఆ సమయంలోనే వివాహమైంది. తర్వాత కొన్నాళ్లకు పిల్లలు పుట్టడంతో ఉద్యోగం చేసేందుకు ఇబ్బందులు ఏర్పడటంతో ఎంపెడా ఉద్యోగానికి రాజీనామా చేసింది. తర్వాత 2019లో జగన్ ప్రభుత్వం సచివాయాల ఉద్యోగుల నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేయడంతో మరోసారి పరీక్షకు సన్నద్ధమైంది. పరీక్షల సన్నద్ధతకు తక్కువ సమయం ఉన్నప్పటికీ కష్టపడి సచివాలయ ఉద్యోగ పరీక్షల్లో మంచి మార్కులు సాధించి మహిళా పోలీస్‌గా ఎంపికై విధుల్లో చేరింది. కూటమి ప్రభుత్వం డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేసిన తర్వాత రెండు నెలలు ఉద్యోగానికి సెలవు పెట్టి రాత్రీ పగలు కష్టపడింది. దీంతో ఒకేసారి స్కూల్ అసిస్టెంట్ తెలుగు, గురుకుల సంక్షేమ పాఠశాల ఉపాధ్యాయ పోస్టుకు సంబంధించిన టిజిటి పరీక్షల్లోనూ సత్తా చాటింది. ప్రస్తుతం డిఎస్‌సి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తి చేసుకుంది. తన మొదటి ప్రాధాన్యతగా స్కూల్ అసిస్టెంట్ పోస్టును ఎంచుకున్నట్లు తెలిపింది. తక్కువ సమయంలో పరీక్షలకు సన్నద్ధమై కొలువు సాధించడం సుజనా కుమారి ప్రతిభకు అద్దం పడుతోంది. సుజనా కుమారి భర్త గంగుల సత్యనారాయణ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. సుజనాకుమారి ఉపాధ్యాయ కొలువు సాధించడంతో ద్వారకాతిరుమల మండలం వేంపాడు గ్రామంలోని ఆమె పుట్టింటివారు, గణపవరంలోని అత్తింటి వారు ఆనందోత్సాహాల్లో మునిగి తేలారు. సుజనా కుమారి మాట్లాడుతూ తన భర్త, కుటుంబసభ్యుల సహకారంతోనే ఇది సాధ్యమైందని చెప్పి ఆనందం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయినిగా మంచి పేరు తెచ్చుకోవాలనుకుంటున్నట్లు తెలిపారు.

అక్కిరెడ్డిగూడెం రాగసుధ హ్యాట్రిక్

ప్రజాశక్తి - ముసునూరు

తొలి ప్రయత్నంలోనే మూడు ఉద్యోగాలకు ఎంపికైన ఘనత ముసునూరు మండలం అక్కిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన బొప్పూడి రాగసుధ సాధించింది. రాగసుధ ఇటీవల వెల్లడైన డిఎస్‌సి ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్ హిందీలో 82.28 మార్కులతో 5వ ర్యాంక్, పిజిటిలో 78.5 మార్కులతో ఆరో ర్యాంక్, టిజిటిలో 82.28 మార్కులతో 9వ ర్యాంక్ సాధించింది. రాగసుధ తండ్రి బొప్పూడి నాగేశ్వరరావు వ్యవసాయ కూలీగా పని చేస్తున్నారు. రాగసుధ తండ్రి కుటుంబం ఆర్థికంగా పెద్ద స్తోమత లేకపోవడంతో ఆమె ఇంటర్ పూర్తి చేశాక, డిగ్రీ దూరవిద్య ద్వారా పూర్తి చేశారు. వివాహమైన అనంతరం హిందీ భాషా ప్రవీణ కోర్సులు పూర్తి చేశారు. ఆ సందర్భంలో రాసిన ఎల్‌పి సెట్‌లో ప్రథమ ర్యాంకు లభించింది. ఎంఎ హిందీ, హిందీ స్పెషల్ బిఎ కూడా పూర్తి చేశారు. విజయనగరంలో సాయి డిఎస్‌సి కోచింగ్ సెంటర్‌లో 2022లో టెట్ కోచింగ్ తీసుకుని మంచి మార్కులు సాధించారు. 2024 ఫిబ్రవరిలో జరిగిన టెట్‌లో రాష్ట్రస్థాయిలో నాలుగో ర్యాంక్ సాధించారు. 2024 జులైలో జరిగిన టెట్‌లోనూ అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. తన విజయం వెనుక తల్లిదండ్రులతోపాటు భర్త సహకారం మరువలేనిదని రాగసుధ తెలిపారు. ఇంటి పనులతోపాటు పిల్లలను తన భర్త చూసుకుంటూ తాను చదువుకోవడానికి అవకాశం కల్పించారన్నారు. తమకున్న ఇద్దరు చిన్న పిల్లలను ఇంటి వద్ద వదిలిపెట్టి డిఎస్‌సి శిక్షణ కూడా సాయి కోచింగ్ సెంటర్‌లోనే తీసుకున్నానని తెలిపారు. ప్రతిరోజూ 14 గంటలు చదివానన్నారు. దృఢ సంకల్పం ఉంటే ఏదైనా సాధ్యమేనని, పేదరికం అడ్డుకాదని అన్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, గ్రామంలోని పలువురు ప్రముఖులు రాగసుధను అభినందించారు.

అపోహలను నమ్మొద్దు

జిల్లాలో సరిపడా యూరియా నిల్వలు

ప్రస్తుతం 1700 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో

మరో వారంలో జిల్లాకు వెయ్యి మెట్రిక్ టన్నుల యూరియా

కలెక్టర్ సూచనలతో యూరియా సరఫరాలో పకడ్బందీ చర్యలు

'ప్రజాశక్తి'తో జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ భాషా

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

యూరియాపై కొంత మంది సృష్టించిన అపోహలతో రైతులు ఆందోళనకు గురవుతున్నారని, యూరియాకు సంబంధించి జిల్లాలో ఎటువంటి ఇబ్బందీ లేదని, రైతులు వదంతులను నమ్మొద్దని జిల్లా వ్యవసాయాధికారి (జెడి) హబీబ్ భాషా తెలిపారు. యూరియా కొరతపై ప్రచారం నేపథ్యంలో కొన్ని రోజులుగా ప్రత్యేకంగా యూరియా సరఫరాపై దృష్టి సారించి ఎక్కడా ఎటువంటి ఇబ్బందీ లేకుండా చేసినట్లు ఆయన తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో యూరియా సరఫరాపై జిల్లా వ్యవసాయ శాఖ, మార్క్‌ఫెడ్, సహకార శాఖతోపాటు ఇతర శాఖల అధికారులు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నామన్నారు. ప్రస్తుతం జిల్లాలో 1700 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని, వారం రోజుల్లో మరో వెయ్యి టన్నుల యూరియా అందుబాటులోకి రానుందని వివరించారు. ఖరీఫ్ సీజన్‌లో జిల్లాకు ఎంత యూరియా అవసరం, ఇంతవరకూ ఎంత జిల్లాకు చేరింది, యూరియా కొరత అంటూ సాగుతున్న ప్రచారంపై ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడారు.

ప్రశ్న: ఖరీఫ్ సీజన్‌లో జిల్లావ్యాప్తంగా ఎన్నివేల ఎకరాల్లో పంటలు సాగువుతున్నాయి?

జెడి: జిల్లావ్యాప్తంగా ఖరీఫ్ సీజన్‌లో 2.52 లక్షల ఎకరాల్లో వరిసాగుతోపాటు ఉద్యాన పంటలన్నీ కలుపుకుని 4.50 లక్షల ఎకరాల్లో వ్యవసాయ పంటలు సాగవుతున్నాయి.

ప్రశ్న: ఖరీఫ్ సీజన్‌లో ఎరువులు ఎన్ని మెట్రిక్ టన్నులు అవసరం, ముఖ్యంగా యూరియా ఎంత అవసరమని గుర్తించారు?

జెడి: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో యూరియా, కాంప్లెక్స్ ఎరువులు మొత్తం 1,18,402 మెట్రిక్ టన్నులు అవసరం. యూరియా 33,762 మెట్రిక్ టన్నులు అవసరం ఉంది.

ప్రశ్న: ఇప్పటి వరకూ జిల్లాకు జరిగిన యూరియా సరఫరా ఎంత? ప్రస్తుతం ఎంతమేర యూరియా నిల్వలు ఉన్నాయి? ఇప్పట్లో ఇంకా వచ్చే అవకాశం ఉందా?

జెడి: మొత్తం 33,762 మెట్రిక్ టన్నుల యూరియాకుగాను ఇప్పటి వరకూ 28,414 మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు వచ్చింది. ప్రస్తుతం మార్క్‌ఫెడ్, డీలర్ల వద్ద 1700 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయి. మరో వెయ్యి టన్నులు వారంలో జిల్లాకు రానుంది.

ప్రశ్న: యూరియా కొరత అంటూ రైతులు ఆందోళన చెందుతున్న పరిస్థితి ఉంది. దీన్ని ఏవిధంగా చూడాలి?

జెడి: యూరియా కొరత అనేది కొంతమంది సృష్టించిన అపోహనే. జిల్లాలో యూరియా కొరత లేదు. పోలవరం మండలం గూటాలలో సైతం రైతులకు సరిపడా యూరియా అందించాం.

ప్రశ్న: యూరియాపై ఈ విధమైన ఇబ్బంది రావడానికి కారణాలు ఏమై ఉండొచ్చు?

జెడి: ఎరువుల సరఫరా అనేది నిరంతరం సాగుతూనే ఉంటుంది. నెలవారీ యాక్షన్ ప్లాన్ ఆధారంగా ఎరువుల సరఫరా జరుగుతోంది. యూరియా కొరత అంటూ అపోహలు సృష్టించడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. దీంతో ఇంకా సాగు ప్రారంభించని మొక్కజొన్న, ఇతర పంటల రైతులతోపాటు పామాయిల్ రైతులు సైతం యూరియా తీసుకుని ఇంట్లో నిల్వ చేసుకున్నారు. ఈ కారణంగానే యూరియా కొరత అంటూ ప్రచారం సాగింది. ఆగస్టు నెలకు కావాల్సిన యూరియా సరాఫరా సైతం ఇబ్బంది లేకుండా సాగింది.

ప్రశ్న: యూరియాపై సాగుతున్న ప్రచారం నేపథ్యంలో సరఫరాపై ఏమైనా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారా?

జెడి: జిల్లా కలెక్టర్ ఆదేశాలతో వ్యవసాయ శాఖ, మార్క్‌ఫెడ్, సహకార శాఖల అధికారులు, ఇతర శాఖల అధికారులను కలుపుకుని కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశాం. జిల్లాలో 96 సహకార సంఘాలు, 11 డిసిఎంఎస్ కౌంటర్లు, తొమ్మిది ప్రయివేటు హోల్‌సేలర్స్, 300కుపైగా డీలర్ల ద్వారా యూరియా సరఫరా జరుగుతోంది. 70 శాతం మార్క్‌ఫెడ్ ద్వారా, 30 శాతం డీలర్ల ద్వారా రైతులకు యూరియా, ఇతర ఎరువుల సరఫరా సాగుతోంది.

ప్రశ్న: ఎరువులకు సంబంధించి ఏమైనా తనిఖీలు చేస్తున్నారా?

జెడి: ఎరువుల దుకాణాల్లో తనిఖీలతోపాటు చెక్‌పోస్టులు, జిల్లా సరిహద్దుల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం.

ప్రశ్న: యూరియా సరఫరాపై రైతులకు ఏమైనా చెబుతారా?

జెడి: యూరియా గురించి రైతులు ఎటువంటి ఆందోళనా చెందనక్కర్లేదు. యూరియా నిల్వలు సరిపడా అందుబాటులోనే ఉన్నాయి. ప్రతినెలా ప్లానింగ్ ప్రకారం వస్తూనే ఉంటుంది. కొంతమంది సృష్టిస్తున్న అపోహలను నమ్మొద్దు. అవసరం మేరకు తీసుకెళ్లండి. ఎక్కువగా తీసుకెళ్లి నిల్వ పెట్టుకోవడం వల్ల ఇతర రైతులు ఇబ్బందులు పడే పరిస్థితి ఉంది. ఎరువులకు సంబంధించి జిల్లా అధికార యంత్రాంగం నిరంతరం ప్రత్యేక శ్రద్ధతో రైతులకు ఇబ్బందుల్లేకుండా పని చేస్తోంది.

తనిఖీలు చేస్తున్న సబ్ కలెక్టర్ వినూత్న

సమస్యల పరిష్కారానికి కృషి

నూజివీడు సబ్ కలెక్టర్ వినూత్న

ప్రజాశక్తి - చింతలపూడి

సమస్యల పరిష్కారానికి పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటామని నూజివీడు సబ్ కలెక్టర్ వినూత్న అన్నారు. మండలంలోని తీగలవాంచ, కొమ్ముగూడెం గ్రామాల్లో ఆమె శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా కొమ్ముగూడెంలో పాఠశాల, అంగన్‌వాడీ భవనాల సమస్యలతో పాటు పలు సమస్యలను సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అనంతరం లింగపాలెం మండలం ధర్మాజీగూడెం ఎంఎల్ఎస్ పాయింట్లను తనిఖీ చేశారు. గోడౌన్‌లో ఉన్న బియ్యం, పంచదార, కందిపప్పు నిల్వలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గోడౌన్ నుంచి రేషన్ డీలర్లు బియ్యం తీసుకెళ్లే ముందు, అలాగే రేషన్ షాపులో బియ్యం దించుకోగానే వేలిముద్రలు వేయాలని చెప్పారు. అక్రమంగా పట్టుబడిన 34 టన్నుల రేషన్ బియ్యాన్ని తనిఖీ చేసి బియ్యం పాడవ్వకముందే వేలంపాటకు సిద్ధం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. గోడౌన్‌లో ఉన్న హమాలీలతో మాట్లాడి వారి సమస్యలను, రేషన్ డీలర్ల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గోడౌన్ తనిఖీల్లో లింగపాలెం తహశీల్దార్ నాజీముల్లాషా, తదితరులు పాల్గొన్నారు.

పూర్తయిన డిఎస్‌సి అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్

28 మంది డిజబుల్డ్ అభ్యర్థుల వెరిఫికేషన్ పెండింగ్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

డిఎస్‌సి-2025 అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ శుక్రవారం సాయంత్రం పూర్తయింది. వట్లూరులోని సిఆర్.రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ప్రారంభమైన వెరిఫికేషన్ రెండు రోజులపాటు కొనసాగింది. గురువారం ఉదయానికి 804 మందికి కాల్ లెటర్స్ రాగా రాత్రి తొమ్మిది గంటల సమయానికి 780 మందికి వెరిఫికేషన్ పూర్తి చేశారు. అలాగే మరో 230 మందికి గురువారం కాల్ లెటర్స్ జనరేట్ అవ్వడంతో వారంతా కాల్ లెటర్స్ డౌన్‌లోడ్ చేసుకుని శుక్రవారం వెరిఫికేషన్‌కు హాజరయ్యారు. శుక్రవారం సాయంత్రానికి 28 మంది డిజబుల్డ్ అభ్యర్థుల వెరిఫికేషన్ పెండింగ్‌లో ఉండగా మిగిలిన అభ్యర్థుల వెరిఫికేషన్ పూర్తయింది. ఆ 28 మంది వికలాంగ అభ్యర్థులు వారి వారి వైకల్యాన్ని ధ్రువీకరించే సర్టిఫికెట్లు అప్‌డేట్ చేయించుకుని రావాల్సి ఉందని, ఆ సర్టిఫికెట్లు తెచ్చిన అనంతరం వారి వెరిఫికేషన్ కూడా పూర్తవుతుందని విద్యాశాఖాధికారులు తెలిపారు. తదుపరి ప్రక్రియకు సంబంధించి రాష్ట్రస్థాయి అధికారుల నుంచి ఆదేశాలు రావాల్సి ఉందని, ఆదేశాలు వచ్చిన తర్వాత అపాయింట్‌మెంట్ ఆర్డర్‌కు సంబంధించి షెడ్యూల్ విడుదల చేస్తారని అధికారులు తెలిపారు.

సోలార్ రూఫ్‌టాప్‌ను సద్వినియోగం చేసుకోండి

చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

మాట్లాడుతున్న ఎంఎల్ఎ రోషన్‌కుమార్

భవనం ఉన్న ప్రతి ఎస్‌సి, ఎస్‌టిలకు కూటమి ప్రభుత్వం ఉచితంగా సోలార్ రూఫ్‌టాప్‌ను ఏర్పాటు చేస్తుందని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్ కుమార్ తెలిపారు. పిఎం సూర్య ఘర్ యోజన ద్వారా గృహ వినియోగదారులు అతి తక్కువ విద్యుత్ బిల్లు చెల్లించాల్సి వస్తుందదన్నారు. పట్టణంలోని లయన్స్ క్లబ్‌లో ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజనపై శుక్రవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటిపై కప్పుపై కనీసం 10 చదరపు మీటర్లు, వంద చదరపు అడుగుల స్థలంలో కిలో వాట్స్ సామర్థ్యం కలిగిన సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకోవడం ద్వారా తమ విద్యుత్ అవసరాలను స్వయంగా తీర్చుకోవచ్చన్నారు. ఈ పథకాన్ని సక్రమంగా అమలు చేసి, ప్రజలకు లబ్ధి కల్పించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందఅన్నారు. ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన ద్వారా సౌరశక్తి వినియోగం పెరిగి, విద్యుత్ బిల్లు తగ్గించే అవకాశాలు ఉంటాయన్నారు. సోలార్ రూఫ్ టాప్ వ్యవస్థల ద్వారా అందరూ పర్యావరణ అనుకూలమైన శక్తిని ఉపయోగించి, విద్యుత్ వృథాను తగ్గించవచ్చన్నారు. ఈ పథకం ద్వారా ప్రజల ప్రయోజనాలు పెరుగుతాయని, ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం ఎలక్ట్రికల్ డిఇతో పాటు నాలుగు మండలాల ప్రజా ప్రతినిధులు, టిడిపి మండల, పట్టణ అధ్యక్షులు, డ్వాక్రా సంఘాలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

108 వాహనాలు సమర్థవంతంగా సేవలందించాలి

కొత్త అంబులెన్స్‌ల కొనుగోలుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

108 వాహనాల ద్వారా ప్రజలకు అత్యవసర సమయాల్లో సమర్థవంతంగా సేవలందించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. కొత్త అంబులెన్స్‌ల కొనుగోలుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో శుక్రవారం మెడికల్ కాలేజీ విద్యార్థులకు వసతి గృహ సౌకర్యాలు, 104 వాహనాలు తదితర అంశాలపై జిల్లా వైద్యరోగ్య శాఖ, డిసిహెచ్ఎస్, మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్, సంబంధిత అధికారులతో ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో ఎన్‌టిఆర్ వైద్య సేవ ద్వారా అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు జరిగేలా వైద్యులు చూడాలన్నారు. వైద్యులు, వైద్య సిబ్బంది బాధ్యతతో పని చేసి మంచి ఫలితాలు రాబట్టాలన్నారు. సీసీ కెమెరాల ద్వారా వైద్య సిబ్బంది పనితీరును పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. మెడికల్ కాలేజీ టెక్నీషియన్లు, టెక్నికల్ పోస్టుల భర్తీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. శిథిలావస్థకు చేరిన 108 వాహనాలను ఆక్షన్ వేసి, కొత్త వాహనాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను వెట్రిసెల్వి ఆదేశించారు. జిల్లా మెడికల్ కాలేజీ విద్యార్థులకు వసతి, విద్యాబోధన పట్ల సంతృప్తి చెందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం మెడికల్ విద్యార్థుల వసతికి ఎటువంటి ఇబ్బందులూ లేవన్నారు. అయితే సెప్టెంబరు 5వ తేదీ నాటికి మూడో బ్యాచ్ 150 మంది విద్యార్థులు వస్తారని, వీరికి వేరేచోట అన్ని సౌకర్యాలు ఉన్న వసతి గృహ భవనాన్ని పరిశీలించాలని సూచించారు. ఈలోపుగా మాతాశిశుభవనం రెండో ఫ్లోర్‌లో తాత్కాలికంగా వసతి సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ఇదే ఆసుపత్రిలో ప్రస్తుతం ఉన్న డిసిహెచ్ఎస్ కార్యాలయాన్ని వేరేచోట భవనానికి తరలించి, ఖాళీ చేసిన భవనాన్ని ఆస్పత్రికి అప్పగించాలన్నారు. నర్సింగ్ కాలేజీ, నర్సింగ్ స్కూల్, వసతి గృహాలు ప్రస్తుతం జనరల్ హాస్పిటల్ ఒక ఫ్లోర్‌లో కార్యకలాపాలు జరుగుతున్నాయని, ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజీలోకి వీరిని తరలించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజీ గ్రౌండ్, ఫస్ట్ ఫ్లోర్లు ఒక నెలలో పూర్తి చేయాలని ఎపిఎంఎస్ఐడిసి అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో డిఎంహెచ్ఒ డాక్టర్ పిజె.అమృతం, డిసిహెచ్ఎస్ డాక్టర్ బి.పాల్‌రాజు, సూపరింటెండెంట్ ఎంఎస్.రాజు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.భాస్కర్, 108 మేనేజర్ డి.రాజు, ఎపిఎంఎస్ఐడిసి ఇంజినీర్ యుఎస్‌వై.రాజబాబు, అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పవన్‌కుమార్

మిస్టర్ వరల్డ్ పోటీలకు పవన్‌కుమార్ ఎంపిక

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

బ్యాంకాక్ దేశంలోని థాయిలాండ్‌లో ఈనెల 18 నుంచి 25వ తేదీ వరకు జరిగిన మిస్టర్ ఆసియా బాడీ బిల్డింగ్ పోటీల్లో ఏలూరుకు చెందిన కోడూరి పవన్‌కుమార్ వంద కేజీల విభాగంలో సిల్వర్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా పవన్ కుమార్ మాట్లాడుతూ మిస్టర్ ఆసియా పోటీల్లో పాల్గొని దేశానికి మెడల్ తేవడం ఎంతో గర్వకారంగా ఉందన్నారు. నవంబర్ నెలలో జరిగే మిస్టర్ వరల్డ్ పోటీలకు కూడా ఎంపికైనట్లు తెలిపారు. గత ఆరేళ్ల నుంచి బాడీ బిల్డింగ్‌లో కష్టపడుతున్నానని, ఈ మెడల్ రావడం తనకు ఎంతో సంతోషంగా ఉందని చెప్పారు. డిగ్రీ చదువుతున్న సమయంలో అన్నయ్య యూనివర్సిటీ తరపున పాల్గొని ఆలిండియా గోల్డ్ మెడల్స్ గెలిచానన్నారు. మిస్టర్ వరల్డ్ పోటీల్లో పాల్గొనడానికి ప్రభుత్వం నుంచి సాయం చేయాలని కోరారు. తన కోచ్ అయిన రామలక్ష్మణకు కృతజ్ఞతలు తెలిపారు.

కల్తీ పెట్రోల్ విక్రయిస్తున్నారని నిరసన

వాహనాలు మరమ్మతులకు గురయ్యాయని ఆవేదన

అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వాహనదారుల వేడుకోలు

నిరసన తెలుపుతున్న వాహనదారులు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

బంకులో కల్తీ పెట్రోల్ విక్రయిస్తున్నారని వాహనదారులు నిరసన తెలిపారు. మండలంలోని కన్నాపురం రోడ్డులో శివాలయం ఆలయం సెంటర్‌లో ఉన్న ఇండియన్ ఆయిల్ బంకులో కల్తీ పెట్రోల్ విక్రయిస్తున్నారని వాహనదారులు శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కల్తీ పెట్రోల్ విక్రయించడంతో తమ వాహనాలు మరమ్మతులకు గురై స్టార్ట్ అవ్వడంలేదని చెప్పారు. స్టార్ట్ అయినా తెల్లటి పొగ వచ్చి ఆగిపోతున్నాయన్నారు. ఈ విషయాన్ని పెట్రోల్ బంక్ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్తే పెట్రోల్ నాణ్యతా ప్రమాణాలు సక్రమంగానే ఉన్నాయని, ఏమైనా తేడాలు ఉంటే సంబంధిత అధికారులతో మాట్లాడుకోమని చెబుతున్నారని తెలిపారు. గతంలో కూడా ఇండియన్ ఆయిల్ బంకులో కల్తీ పెట్రోల్ కొట్టడంతో 300 వాహనాలు పాడైపోయాయని నిరసన చేయగా, యాజమాన్యం వారు కొంతమంది వాహనాలకు మరమ్మతులు చేయించారన్నారు. అనంతరం వాహనదారులు తహశీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకుని అక్కడ నిరసన తెలిపారు. అధికారులు స్పందించి కల్తీ పెట్రోల్ విక్రయిస్తున్న బంకు యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని, పాడైపోయిన వాహనాలకు మరమ్మతులు చేయించాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో కె.భీముడు, శివ, సురేష్, టి.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

30, 31 తేదీల్లో ఐద్వా జిల్లా మహాసభ

జయప్రదం చేయాలి : జిల్లా అధ్యక్ష కార్యదర్శులు హైమావతి, శ్యామలారాణి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా మహాసభ ఈ నెల 30, 31 తేదీల్లో స్థానిక యుటియఫ్ జిల్లా కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి.హైమావతి, ఎ.శ్యామలారాణి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మహాసభలో గత మూడేళ్లుగా జరిగిన ఐద్వా కార్యక్రమాలను, సంఘం నిర్మాణాన్ని సమీక్షిస్తామని తెలిపారు. సమాజంలో మహిళలు అత్యధికంగా శ్రమ దోపిడీకి గురవుతున్నారని, గృహ హింస, వరకట్నం వేధింపుల నుంచి మహిళలు బయటపడలేదని, పని ప్రదేశాల్లో శ్రమ దోపిడీకి తోడు లైంగిక వేధింపులు పెరిగాయన్నారు. మహిళలు పనిచేసే చోట లైంగిక వేధింపుల నిరోధక కమిటీలు ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ ఆదేశాలు అమలు కావటం లేదని, ఈ నేపథ్యంలో మహాసభలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. జిల్లా నూతన కమిటీ ఎన్నిక కూడా మహాసభలో ఉంటుందన్నారు. ఈ సభలకు ముఖ్య అతిథిగా ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి, రాష్ట్ర నాయకులు శ్రీదేవి హాజరవుతారని వివరించారు. మహాసభ జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

నాలుగేళ్ల చిన్నారిపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.ఐదు వేల జరిమానా విధిస్తూ పోక్సో ప్రత్యేక న్యాయమూర్తి శుక్రవారం తీర్పునిచ్చారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... టి.నర్సాపురం గ్రామానికి చెందిన నాలుగేళ్ల బాలికపై అదే గ్రామానికి చెందిన పిల్ల వెంకటేశ్వరరావు (నందా) 2018లో అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. శుక్రవారం ఈ కేసులో నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.ఐదు వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. రూ.ఐదు వేలు జరిమానా కట్టలేని పక్షంలో మరో ఆరు నెలలు అదనంగా జైలు శిక్ష విధించారు.

ఆర్‌జియుకెటిలో ఇంటర్నల్ హ్యాకథాన్

ప్రజాశక్తి నూజివీడు టౌన్

రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్‌జియుకెటి) నూజివీడులో అమరావతి క్వాంటం వ్యాలీ హ్యాకథాన్ (ఎక్యువిహెచ్)- 2025 సంవత్సరానికి సంబంధించి ఇంటర్నల్ హ్యాకథాన్‌ను మినీ షాప్ ఆటోరోయంలో విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 30 టీమ్‌లు నమోదు చేసుకోగా, 29 టీమ్‌లు తమ ఐడియాలను అధికారిక పోర్టల్‌లో సమర్పించాయి. అందులో 25 టీమ్‌లు శుక్రవారం జరిగిన హ్యాకథాన్‌లో పాల్గొని తమ ప్రతిభను, సృజనాత్మకతను ప్రదర్శించాయి. జ్యూరీ సభ్యులు విద్యార్థుల ఉత్సాహాన్ని, వినూత్నతను ప్రశంసించారు. ఈ కార్యక్రమానికి ఆర్‌జియుకెటి డైరెక్టర్ సంధ్య అమరేంద్ర కుమార్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ బి.లక్ష్మణరావు, అకాడమిక్స్ డీన్ డాక్టర్ సాదు చిరంజీవి, ఐటిబిసి డీన్ పి.శ్యామ్, అన్ని విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వేల్పుచర్లలో శానిటేషన్

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని వేల్పుచర్ల గ్రామంలో ఇద్దరికి డెంగీ లక్షణాలు కనిపించడంతో ఎంపిడిఒ జనపరాజు అమృత సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసచౌదరి ఆధ్వర్యంలో శుక్రవారం శానిటేషన్ చేయించారు. వైద్యులు షకీనా అంజలీసిన్ ఆధ్వర్యంలో గ్రామంలో పలువోట్ల వైద్య శిబిరాలు నిర్వహించారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తూ మందులు పంపిణీ చేశారు.

శానిటేషన్ చేస్తున్న సిబ్బంది

రోడ్డు అభివృద్ధి చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - టి.నర్సాపురం

మండలంలోని అప్పలరాజుగూడెం రోడ్డును అభివృద్ధి చేయాలని సిపిఎం జిల్లా నాయకులు గుడెల్లి వెంకట్రావు డిమాండ్ చేశారు. రోడ్డు పరిస్థితిపై శుక్రవారం ఆయన స్థానికి విలేకర్లతో మాట్లాడుతూ మండలంలో రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉందన్నారు. ప్రధానంగా జంగారెడ్డిగూడెం మండలం లక్ష్మీపురం నుంచి టి.నరసాపురం వరకు ఉన్న రోడ్డు పూర్తిగా పాడైపోయిందని తెలిపారు. రోడ్డు పొడవునా గోతులు ఏర్పడడంతో వాహనదారులు రోడ్డుపై వాహనాలు నడపలేని తీవ్ర ఇబ్బంది పడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఐదేవేల మూడు నెలల క్రితం ఇదే రోడ్డులో కొంతమేర రోడ్డు మరమ్మతులు చేశారని, మరమ్మతులు చేసిన రోడ్డు కూడా నాణ్యత లోపంతో మళ్లీ గోతులు ఏర్పడి వాహనాలు పడిపోయే పరిస్థితి నెలకొందన్నారు. వెంటనే ఉన్నతాధికారులు, పోలవరం ఎంఎల్‌ఎ బాలరాజు స్పందించి రోడ్డు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అప్పటివరకు కనీసం గుంతలు అయినా పూడ్చే కార్యక్రమం చేపట్టాలని కోరారు.

దిగబడిన ట్రాక్టర్

ప్రతాప్‌కుమార్‌కు ఉద్యోగ విరమణ సత్కారం

ప్రజాశక్తి - మండవల్లి

ఉపాధ్యాయ వృత్తికి పి.ప్రతాప్‌కుమార్ ఎనలేని సేవలందించారని ఎంఇఒ రత్నసునందం అన్నారు. మండవల్లి మండల ప్రాథమిక పాఠశాల-1లో పిట్ట ప్రతాప్‌కుమార్‌కు శుక్రవారం నిర్వహించిన ఉద్యోగ విరమణ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వృత్తిలో ఉన్నతమైనది ఉపాధ్యాయ వృత్తి అని అన్నారు. ప్రతాప్‌కుమార్ విద్యార్థుల పట్ల అంకితభావంతో సొంత బిడ్డలుగా భావించి విద్యాబుద్ధులు నేర్పారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను పేరెంట్స్ కమిటీ సమావేశాల ద్వారా విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేసి పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం పెంపుదలకు ఎంతో కృషి చేశారన్నారు. 31 ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతూ ఎంతోమంది విద్యార్థులను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దారని తెలిపారు. అనంతరం ఆయనను సహచర ఉపాధ్యాయులు, బంధువులు, కుటుంబీకులు, స్నేహితులు, దుశ్శాలువాతో, పూలమాలతో ఘనంగా సత్కరించారు.



ప్రతాప్‌కుమార్‌ను సత్కరిస్తున్న ఎంఇఒ, తదితరులు

దాతల సాయం అభినందనీయం

ప్రజాశక్తి - భీమడోలు

విద్యాభ్యాసికి అన్నేవారిగూడెం మండల ప్రజా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు దాతల సహాయ సహకారాలు అభినందనీయమని భీమడోలు ఎంఇఒ-1 శ్రీనివాసరావు అన్నారు. గ్రామ సర్పంచి నీలం శ్రీనివాసరావు, ఎంపిటిసి సభ్యులు పి.శ్రీనివాసరావు, గ్రామ ప్రముఖులు అన్నెం రాంబాబు సంయుక్తంగా పాఠశాల విద్యార్థులకు అవసరార్థం రూ.15 వేల విలువైన పేట్లను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాతలను సన్మానించారు. గతంలో సైతం ఇదే ఒరవడి కొనసాగించిన పాఠశాల పూర్వ ప్రధానోపాధ్యాయులు షేక్ మస్తాన్ సేవలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఎస్.కొండయ్య, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణతో ప్రాణరక్షణ

ప్రజాశక్తి - మండవల్లి

ప్రమాద సమయంలో హెల్మెట్ ప్రాణాలను కాపాడుతుందని ఎస్ఐ రామచంద్రరావు స్పష్టం చేశారు. మండలంలోని లోకుమూడి సెంటర్‌లో శుక్రవారం ఆయన వాహనాలను, రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారి ప్రమాదాలు సంభవించి వాహనదారుల తలకు తీవ్ర గాయమై అధిక రక్తస్రావం జరిగి మృతి చెందుతున్నారన్నారు. హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడుపుతున్న వాహనదారులే ప్రమాదం సంభవించి ఎక్కువ శాతం ప్రాణాలను కోల్పోయారని తెలిపారు. హెల్మెట్ ఉనికి ప్రాణం కాకుండా వాహనదారుడి ప్రాణానికి భద్రత కల్పిస్తుందని ప్రతిఒక్కరూ తెలుసుకోవాలన్నారు. వాహన పత్రాలు వాహనం వద్ద ఉంచుకోవాలని, లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హెల్మెట్ ధరించని, వాహన పత్రాలు లేని 11 మంది వాహనదారులకు రూ.4,735 చలానా విధించినట్లు ఆయన తెలిపారు.

నేరాలు - ఘోరాలు

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

ప్రజాశక్తి - భీమడోలు

వ్యవసాయ శాఖ, విజిలెన్స్ శాఖలు సంయుక్తంగా శుక్రవారం భీమడోలులో దాడులు నిర్వహించాయి. దీనిలో భాగంగా విజిలెన్స్ ఎస్ఐ కె.సీతారాముడు, భీమడోలు వ్యవసాయాధికారి ఉషారాణి దాడులకు నాయకత్వం వహించారు. కురెళ్లగూడెంలో రెండు ఎరువులు, పురుగుమందుల దుకాణాలపై దాడులు చేశారు. శ్రీలక్ష్మి ట్రేడర్స్‌లో ఇఫ్‌కో ఎరువుల నమూనా సేకరించారు. ఈ దుకాణంలో 140 బస్తాల సింగిల్ సూపర్ ఫాస్పేట్ ఎరువులు నిల్వ ఉన్నట్లు గుర్తించారు. దీని విలువ రూ.73,500 ఉంటుందని అంచనా కట్టారు. సాంకేతిక కారణాల వల్ల ఈఫస్ట్ యంత్రంలో నిల్వ వివరాలు నమోదు కానట్లు యజమాని తెలిపారన్నారు. 140 బస్తాల సింగిల్ సూపర్ ఫాస్పేట్ ఎరువుల అమ్మకాలను నిలిపివేయాలని ఆదేశించినట్లు విజిలెన్స్, వ్యవసాయ అధికారులు తెలిపారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ఘనంగా గిడుగు రామ్మూర్తి జయంతి వేడుకలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

వ్యవహారిక భాష పితామహుడు గిడుగు వెంకట రామ్మూర్తి జయంతిని పురస్కరించుకుని హిందూ యువజన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఏలూరు వైఎంహెచ్ఎ హాలులో తెలుగు భాషా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా సంస్థ మేనేజ్‌మెంట్ కమిటీ, కార్యనిర్వాహక కమిటీల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యర్రా సోమలింగేశ్వరరావు, కె.వి.సత్యనారాయణ, యిరదల ముద్దుకృష్ణ, మజ్జి సూర్యకాంతారావు, తెలుగుతల్లికి పూలమాలలు సమర్పించారు. సభ్యులు మా తెలుగు తల్లికి మల్లెపూదండ గీతాన్ని ఆలపించారు. అనంతరం హాలులో జరిగిన సమావేశంలో గిడుగు వెంకట రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి స్మరించారు. ఈ సందర్భంగా మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు యర్రా సోమలింగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కె.వి.సత్యనారాయణ, కార్యనిర్వాహక కమిటీ అధ్యక్షులు యిరదల ముద్దుకృష్ణ, ప్రధాన కార్యదర్శి మజ్జి సూర్యకాంతారావు మాట్లాడారు. తెలుగు భాష గొప్పదనం గురించి ఉపాధ్యక్షులు ఎల్.వెంకటేశ్వరరావు (ఎల్‌విఆర్), సభ్యులు డాక్టర్ లంక వెంకటేశ్వర్లు, జిల్లెళ్లమూడి వరప్రసాదరావు వివరించారు. ఈ కార్యక్రమంలో మేనేజ్‌మెంట్ కమిటీ గౌరవ అధ్యక్షులు అంబికా రాజా, సహాయ కార్యదర్శి సిహెచ్.సాయితేజ, కోశాధికారి కానాల బాల వెంకట రమేష్ పాల్గొన్నారు.

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం సంయుక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ గుత్తా గిరిబాబు అధ్యక్షత వహించి మాట్లాడారు. ముఖ్య అతిథిగా ఎస్ఎస్ఆర్ ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.నరసింహ్‌రెడ్డి హాజరయ్యారు. మరొక అతిథి వి.వి.స్వామి మాట్లాడారు. అనంతరం సిపిడిసి సభ్యులు ఎల్.వెంకటేశ్వరరావు, మాతృదేవోభవ సంస్థ ప్రతినిధులు ఆనందనాయుడు, కూచిపూడి సత్యనారాయణ, తెలుగు భాష ప్రస్తుతం ఎదుర్కొంటున్న సవాళ్లు, పరిష్కార మార్గాలను సూచించారు. కార్యక్రమాన్ని తెలుగు అధ్యాపకులు ఎస్.పరమేశ, రజనీతి శాస్త్ర అధ్యాపకులు టి.వెంకటదుర్గాప్రసాద్ సమన్వయం చేశారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు.

ఏలూరు సిటీ : ఏలూరులోని సత్రంపాడు ఆదిత్య డిగ్రీ కళాశాలలో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించినట్లు ప్రిన్సిపల్ వంగా వెంకటేశ్వరరావు తెలిపారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ పరిధిలో జరిగిన పరీక్షల్లో తెలుగులో రాణించిన విద్యార్థులకు బహుమతులు అందించారు.

భీమడోలులో...

తెలుగు విభాగానికి చెందిన వెంకట్రావు, పూర్ణిమ, అనిత, దీపిక, స్కూల్ యాజమాన్యం, విద్యార్థులు పాల్గొన్నారు.

స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మాతృభాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. వాడుకభాషకు ఆద్యుడు గిడుగు రామ్మూర్తి పంతులు, మేజర్ ధ్యాన్ చంద్ చిత్రపటాలకు హెచ్ఎం సోమశేఖర్ పుష్పాంజలి ఘటించారు. ఫస్ట్ అసిస్టెంట్ శివప్రసాద్, స్టాఫ్ సెక్రెటరీ ఎం.ఎ.నబీ, తెలుగు హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ గుమ్మల వెంకటేశ్వరరావు, పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ శ్రీ సాయి శ్రీనివాస్, ఇంగ్లీష్ హెడ్ పి.శ్రీనివాసరావు, తెలుగు ఉపాధ్యాయులు, ప్రముఖ కవి మెట్ల నాగేశ్వరరావు మాట్లాడారు. ఆటల పోటీలు, ప్రతిభా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు.

ముసునూరు : గిడుగు రామ్మూర్తి తెలుగు భాషకు చేసిన సేవలు మరువలేనివని భారతి విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ ప్రిన్సిపల్ కొండేటి సౌరి మాస్టర్ అన్నారు. తెలుగు తల్లి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. తెలుగు భాషా ఉద్యమ వారధిని యుటిఎఫ్ మండల నాయకులు జి.వడ్డికాశీ, గుడిమెళ్ల రాంబాబు అన్నారు. మండలంలోని చెక్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ అల్లాబక్షు మాట్లాడారు. విద్యార్థులకు వ్యాసరచన, పద్యాల పోటీలు, క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మురళీకృష్ణ, ఎం.శివనాగమణి, మాధవి, బాల భాస్కర్ పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ : మండలంలోని మద్దాయి కుంట గ్రామ జిల్లా పరిషత్ హై స్కూల్‌లో మాతృభాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం దారపురెడ్డి భాస్కరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు శివ నాగరాజు మాట్లాడారు. ప్రోత్సాహక బహుమతులు, మిఠాయిలు పంపిణీ చేశారు.

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం ప్రతిభా పాఠశాలలో వాడుక భాషోద్యమ నాయకుడు గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించినట్లు ప్రిన్సిపల్ కాసర లక్ష్మీసరోజారెడ్డి అన్నారు. డైరెక్టర్ సుభాష్ రెడ్డి మాట్లాడారు. కృష్ణదేవరాయల వేషధారణలో ధ్యాన్విష్ కనువిందు చేశాడు. అష్టదిగ్గజ కవులతో భువన విజయాన్ని ప్రదర్శించారు.తేజశ్రీ తెలుగుతల్లి వేషధారణలో అలరించింది. ఈ కార్యక్రమంలో సంస్కృతోన్నత పాఠశాల, కళాశాలలో తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమ సమన్వయకర్తగా తెలుగు అధ్యాపకురాలు వరలక్ష్మి వ్యవహరించారు. వ్యాసరచన, పద్య పఠనం, క్రీడల్లో గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. తెలుగు ఉపాధ్యాయులు పెద్దిరాజు, వరలక్ష్మి, వ్యాయామ ఉపాధ్యాయులు మల్లయ్యలను హెచ్ఎం, సిబ్బంది సన్మానించారు. తిరుమలంపాలెం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. హెచ్ఎం శేషు కుమారి, తెలుగు మాస్టర్ రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మండవల్లి : తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా ముదినేపల్లిలోని స్ప్రింగ్ ఐటిఐ కళాశాలలో గిడుగు వెంకట రామ్మూర్తి జయంతి వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ కె.సత్యనారాయణ తెలుగు భాష ప్రాముఖ్యత గురించి, గిడుగు వెంకట రామ్మూర్తి జీవిత విశేషాలను వివరించారు. రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ కె.హరిత, మాణిభీమరాజు, కృష్ణమోహన్, విజయదుర్గ, శివ, విద్యార్థులు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల : మండలంలోని గుణంపల్లి

భీమడోలు : మల్కి మహమ్మద్‌పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు షేక్ మస్తాన్ ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగు భాషా దినోత్సవం కార్యక్రమాలను నిర్వహించారు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి తెలుగు పండితులు వెంకటప్పయ్యలను సత్కరించారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు.

తమ్మిలేరు రిజర్వాయర్‌లోకి వరదనీరు

ప్రజాశక్తి - చింతలపూడి

మండలంలోని తమ్మిలేరు రిజర్వాయర్‌లోకి ఎగువ నుంచి వరదనీరు చేరుతున్నదని తమ్మిలేరు జలశాఖ అధికారులు, ఎఇ కె.లాజర్‌బాబు తెలిపారు. తమ్మిలేరు ప్రస్తుత నీటిమట్టం 348.15 అడుగులని, తమ్మిలేరు పూర్తిస్థాయి నీటిమట్టం 355 అడుగులు అని తెలిపారు. తమ్మిలేరులోకి ఎగువ నుంచి వస్తున్న ఇన్ ఫ్లో 5,700 క్యూసెక్కులు దిగువకు వెయ్యి క్యూసెక్కుల నీరు విడుదల చేసినట్లు తెలిపారు.

తమ్మిలేరు వాగుపై వంతెన నిర్మించాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

శనివారపుపేట తమ్మిలేరు వాగుపై శాశ్వత పరిష్కారంగా ఇప్పటికైనా వంతెన నిర్మించాలని సిపిఎం ఏలూరు నగర కార్యదర్శి పంపన రవికుమార్ నగర కార్యదర్శి సభ్యులు గొట్టెపు రవికిషోర్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శనివారపు పేట నూతన వంతెన నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని ఆర్భాటంగా ప్రచారం చేసుకున్న టిడిపి కూటమి నాయకులు నేడు మౌనవ్రతం చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రతివర్షాకాలంలో ఏలూరు ప్రజలను తమ్మిలేరు సమస్య వెంటాడుతున్నా చర్యలు తీసుకోకపోవడంలో ఏలూరు ప్రస్తుత, మాజీ ఎంఎల్ఎ, ఎంపీలకు చిత్తశుద్ధి లేదని తెలిపారు. ఈ వంతెన నిర్మాణం కోసం సిపిఎం ఆధ్వర్యంలో ప్రజల నుంచి సంతకాల సేకరణ చేసి ఆందోళనలు చేస్తామని తెలిపారు.

సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పట్టణంలో సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిపిఎం పట్టణ కన్వీనర్ పసర సూర్యారావు డిమాండ్ చేశారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 20 రోజులుగా మసీద్ సెంటర్ నుంచి ఏలూరు రోడ్డు కార్ల వరకు తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. తాగునీరు సరిగా అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వర్షాకాలం కావడంతో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేక మురుగు నీరు నిల్వ ఉండటంతో ప్రజలు తీవ్ర జ్వరాల బారిన పడుతున్నారని వాపోయారు. వంద పడకల ఆసుపత్రి పూర్తిగా అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. పట్టణంలో కుక్కల బెడద లేకుండా చేయాలన్నారు. పట్టణంలో రోడ్ల నిర్మాణం పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. బయనేరు వంతెన నిర్మాణం చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో గోపి, స్టాలిన్, సత్తిబాబు, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఎరువులు పూర్తిస్థాయిలో ఇవ్వాలి

ప్రజాశక్తి - వేలేరుపాడు రూరల్

రైతులకు ఎరువులు పూర్తిస్థాయిలో ఇవ్వాలని సిపిఐ నాయకులు కోరారు. రైతు సేవా కేంద్రాల్లో యూరియా, డిఎపి బస్తాలను వారు శుక్రవారం పరిశీలించారు. అనంతరం రామవరం పంచాయతీలోని రైతు సేవా కేంద్రంలోని యూరియా డిఎపి ఎరువులను రామవరం సర్పంచి పిట్ట ప్రసాద్, వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కారం దారయ్య, మండల కార్యదర్శి బాడిశ రాము, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మడివి కామయ్య, బంధం నాగేశ్వరరావు, పి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గణేష్ లడ్డూకు రూ.1.20 లక్షలు

ముసునూరు : మండలంలోని కాటేపోపాడు గ్రామంలో వినాయకుని లడ్డూ రూ.1.20 లక్షలు పలికింది. శుక్రవారం వేలంపాట నిర్వహించారు. వేంపాడు మేజర్ డిసి ఛైర్మన్ రావిల్ల బాలకృష్ణ, వారి మిత్రులు రావిల్ల ఆదినారాయణ, వెల్లి నాగవర్ధనరావు, బోయపాటి భాను, సందిగం కిరణ్‌బాబు కలిసి రూ.1.20 లక్షలకు పాట పాడి లడ్డూ దక్కించుకున్నారు.

కార్మిక సంక్షేమ బోర్డును పరిరక్షించాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

భవన, ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పరిరక్షించాలని, సెప్టెంబర్ 21వ తేదీన జరిగే నిర్మాణ రంగ కార్మికుల జనరల్ బాడీ సమావేశాన్ని జయప్రదం చేయాలని పెయింటింగ్ కార్మిక సంఘం ఏలూరు కన్వీనర్ లొట్ల సత్యనారాయణ కోరారు. ఏలూరు ఎఐటియుసి జిల్లా కార్యాలయంలో శుక్రవారం పెయింటింగ్ కార్మికుల జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. సెప్టెంబర్ 21వ తేదీన జరిగే సమావేశం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లొట్ల సత్యనారాయణ మాట్లాడుతూ భవన, ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పరిరక్షించాలని, బోర్డులో ఉండే పథకాలన్నీ తక్షణం పెయింటింగ్ కార్మికులకు ఇచ్చే విధంగా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏలూరు నగరంలో వన్ టౌన్, టూ టౌన్ ఏరియాలో పెయింటింగ్ కార్మికుల ఆధ్వర్యంలో విస్తృతస్థాయి ప్రచారం చేయాలని సమావేశం తీర్మానం చేసింది. ఈ సమావేశానికి మీసాల ప్రసాద్, కృష్ణ, జి.నాగరాజు, ఉదయం యేసు, తదితరులు నాయకత్వం వహించారు.

ఉద్యోగాన్ని బాధ్యతగా చేయాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఉద్యోగాన్ని బాధ్యతగా చేయాలని ఎంపిడిఒ నిఖిల్ మధు శరణ్ పలు శాఖల అధికారులకు, సచివాలయ సిబ్బందికి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రెండు రోజుల పాటు జరిగిన ఆది కర్మయోగి అభియాన్ దృధిన శిక్షణ కార్యక్రమంలో భాగంగా చివరి రోజు శుక్రవారం ఆయన మాట్లాడారు. ఈ శిక్షణకు హాజరైన వివిధ విభాగాల అధికార, సిబ్బంది ప్రతి స్పందనాత్మక పాలన, సేవా భావం, పారదర్శకత, కర్తవ్యనిబద్ధత కార్యాలయాలకు వచ్చే ప్రజలతో అనుబంధం వంటి అంశాలపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఎఇ రామానుజం, ఆరడబ్ల్యుఎస్ ఎఇ వినయ్, అంగన్వాడీ సూపర్‌వైజర్ లక్ష్మీ దేవమ్మ, అంకన్నగూడెం, స్వర్ణవారిగూడెం, తాటియాకులగూడెం, వంకవారిగూడెంలకు చెందిన మండల స్థాయి అధికారులతో పాటు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉషారాజకుమారి సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - భీమడోలు

ఉంగుటూరు నియోజకవర్గంతో పాటు, ద్వారకాతిరుమల మండలంలో రైతుల సంక్షేమానికి వ్యవసాయ శాఖ భీమడోలు సహాయ సంచాలకులు డాక్టర్ పి.ఉషారాజకుమారి అందిస్తున్న సేవలు అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లాస్థాయిలో ఉత్తమ వ్యవసాయ సహాయ సంచాలకులుగా గుర్తింపు పొంది జిల్లా అధికారుల చేతుల మీదుగా సన్మానం పొందిన వ్యవసాయ శాఖ భీమడోలు సహాయ సంచాలకులను భీమడోలు వ్యవసాయాధికారి ఉషారాణి సత్కరించారు. మండల పరిధిలోని ఇతర వ్యవసాయ అధికారులు, సిబ్బంది హాజరయ్యారు. సహాయ సంచాలకులను సన్మానించడంతోపాటు, ఐటీడీఏ కాలంలో బదిలీపై ఇతర మండలాలకు వెళ్లిన సచివాలయ వ్యవసాయ సహాయకులను, ఇతర మండలాల నుంచి వచ్చిన వ్యవసాయ సహాయకులను సత్కరించారు. ఇ క్రాప్ నమోదు, వ్యవసాయ అవసరాల నిల్వలు సిద్ధం చేయటం, నాణ్యతను పరిశీలించడం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని పలువురు వక్తలు పేర్కొన్నారు.

1న చలో విజయవాడ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సెప్టెంబర్ ఒకటో తేదీన ఆంధ్రప్రదేశ్ సిపిఎస్ ఉద్యోగుల సంఘం నిర్వహించతలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఉద్యోగుల ఐకాస ఛైర్మన్ చోడగిరి శ్రీనివాస్, కన్వీనర్ నెరుసు రామారావు, ఐకాస నాయకులు ఆర్ఎస్.హరనాథ్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2004కి ముందు ఉద్యోగం పొందిన (గ్రూపు-1 ,2 ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పోలీసులు, ఇతర క్యాడర్ ఉద్యోగులకు కూడా నూతన పెన్షన్ విధానం సిపిఎస్‌ను అమలు చేస్తున్నారని, అటువంటి వారికి కేంద్ర ప్రభుత్వం మెమో 57 ద్వారా పాత పెన్షన్ కొనసాగిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారని, ఈ విధానాన్ని సుమారు 16 రాష్ట్రాల్లో అమలు చేస్తున్నారని, ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఈ మెమో ప్రకారం ఉత్తర్వులు జారీ చేయాలని పేర్కొన్నారు.



అవగాహనా ర్యాలీలో విద్యార్థులు

నేత్రదానంపై అపోహలు వద్దు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఎల్.వి.ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్ విజయవాడ వారి సౌజన్యంతో నూజివీడు పట్టణంలోని శ్రీ శారద విద్యాసంస్థల విద్యార్థులతో 41 జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా శుక్రవారం పట్టణ ప్రధాన రహదారుల్లో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శారద విద్యాసంస్థల కరస్పాండెంట్ కె.శంకర్రావు మాట్లాడుతూ నేత్రదానంపై అపోహలు వీడి వాస్తవాలు తెలుసుకుని స్వచ్ఛందంగా ముందుకొచ్చి నేత్రదానం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మానవత సిబ్బంది, ఎల్.వి.ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్ టెక్నీషియన్ సాయి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఒరిజినల్ సర్టిఫికెట్స్ పోయినవి

పశ్చిమ గోదావరి జిల్లా, పాలకోడేరు మండలం, గొల్లలకోడేరు (గ్రామం, డోర్‌నెం.6-159, A.S.R.నగర్‌కు చెందిన నడింపల్లి విశ్వధీరవన్ వర్మ, S/o.వెంకట శ్రీనివాసరాజు అను నా యొక్క ఒరిజినల్ సర్టిఫికెట్స్ పోయినవి. సర్టిఫికెట్స్ నెం.SSC (Regular) శ్రీ కాకతీయ హైస్కూల్, భీమవరం SSC మార్కులిస్ట్ నెం.1410118331 మరియు శ్రీకాకుళం జిల్లా శ్రీచైతన్య కాలేజీ ఇంటర్మీడియట్ మార్కులిస్ట్ నెం.1601212965 నెం. గల అను నా యొక్క ఒరిజినల్ సర్టిఫికెట్స్ ది.09-08-2025 తేదిన భీమవరం నుండి పాలకోడేరు ఇళ్లు మారుచుండగా దారి మధ్యలో పడిపోయినవి. దొరికిన వారు ఈ క్రింది అడ్రస్సు తెలియజేయగలరు.

నడింపల్లి విశ్వధీరవన్ వర్మ, S/o.వెంకట శ్రీనివాసరాజు, డోర్‌నెం.6-159, A.S.R.నగర్, గొల్లలకోడేరు, పాలకోడేరు మండలం, ప.గో.జిల్లా. సెల్: 9398645521

BEFORE THE MOTOR ACCIDENTS CLAIM TRIBUNAL-CUM- I ADDL. CHIEF JUDGE: CITY CIVIL COURT AT: SECUNDERABAD
O.P. No. 564 of 2024

Between:
Inapanuri Charan Teja ... Petitioner
And
Mr. Goudimetla Saichandu & Others ... Respondents
To
2. Mr. Vakada Jeevan Sai Kiran, S/o. Ramana, Aged: Major, Occupation: Business R/o. D. No. 3-47-19, Housing Board Colony, Tadepalligudem Village & Mandal, West Godavari District, A.P. State-534101.

NOTICE

Please take notice that in the above matter the petitioner had filed case against you Respondents No.2 for compensation for Rs.4,00,000/- and the same is posted for your appearance on 07-10-2025.

You are advised to appear on 07-10-2025 at 10-30 a.m. before the said court either in person or through an Advocate failing which, the case will be decided exparte.

(BY THE ORDER OF THE COURT)
M/s. CHINTALA YADAIAH
R. ANJAIAH, CH. RAJU, D. SRIVIDHYA
Advocates
23-78/11, 15 th cross, R. K. Nagar, Anandbagh, Malkajgiri,Hyderabad-47. 9849269006, 9701814442
Date:29-08-2025
Place: Hyderabad.

వేలం ప్రకటన
మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
E.P.17/2022 in O.S.No.164/2014

బిట్వీన్ :
కూనపరెడ్డి సత్యనారాయణ ...పిటీషనరు/డి.హెచ్.ఆర్
అండ్
శిద్దాని విజయకుమార్ ...రెస్పాండెంటు/జె.డి.ఆర్

పై నెంబరు ఇ.పిలో డిక్రీ బాకీ వసూలు నిమిత్తం జడ్జిమెంట్ డెట్టర్ స్వాధీనములో గల ఈ దిగువ షెడ్యూలు స్థిరాస్తి పై కోర్టు వారిచే ది.18-08-2025వ సం.రం. తేదీన ఉదయం 10.30 ని.ల లగాయతు వేలం వేయబడును. ఆసక్తి గల వారు వేలంలో పాల్గొని ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని కొనుగోలు చేయవచ్చును.

షెడ్యూలు

పశ్చిమ గోదావరి జిల్లా, నరసాపురం మండలం, నరసాపురం సబ్-రిజిస్ట్రార్ వారి పరిధిలో గల నరసాపురం, 7వ వార్డు, శిద్దాని వారి వీధి, డోర్‌నెం.4-4-52లో ఉన్న చ.గ.38.00లు స్థలముకు ఈ క్రింది ఫ్రాయబడిన హద్దుల మధ్య ఉన్నది.
తూర్పు: శిద్దాని మోహనరావు గారి పోర్షన్
దక్షిణం: శిద్దాని రామారావు గారి గోడ
పడమర: శిద్దాని దుర్గా ప్రసాద్ గారి ఆస్తి
ఉత్తరం: ఉమ్మడి సందు

ఈ హద్దుల మధ్య చ.గ.38.00లు స్థలము, నాటి విధ ఫలవృక్షములతో సహా పూర్తిగా వేలం వేయబడును.
డి.హెచ్.ఆర్. విలువ రూ.3,80,000/-
అమీన్ విలువ రూ. /-
జె.డి.ఆర్. విలువ తెలియజేయలేదు.
వేలం తేది.18-09-2025
కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం

మోపర్ల సత్యకృష్ణ
డి.హెచ్.ఆర్. తరపు న్యాయవాది
జంపా వారి వీధి, నరసాపురం.
సెల్: 9866259514.

చరాస్తి వేలం ప్రకటన
మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
E.P.10/2023 in O.S.No.103/2014

Between:
ఆచంట బదిరినారాయణ, W/o.ఆచంట వెంకట రంగనాయక ప్రభు, నరసాపురం, 15వ వార్డు ...డి.హెచ్.ఆర్/వాది
Vs
ఆచంట లక్ష్మీనారాయణ, S/o.నర్సింహారావు, 53 సం.రం.లు, డోర్‌నెం.15-5-29, వల్లూమ్మ గుడి ప్రక్కన, నరసాపురం. ...జె.డి.ఆర్/ప్రతివాది

పై నెంబరు ఇ.పిలో డిక్రీ బాకీ వసూలు నిమిత్తం జడ్జిమెంట్ డెట్టర్ సంబంధించిన ఈ దిగువ ఉదహరించిన చరాస్తులు కోర్టు వారిచే ది.08-09-2025వ సం.రం. తేదీన ఉదయం 10.30 ని.ల లగాయతు వేలం వేయబడును. ఆసక్తి గలవారు వేలంలో పాల్గొని ఈ దిగువ తెలిపిన చరాస్తులను కొనుగోలు చేయవచ్చును.

చరాస్తుల వివరం

వ.సం.	వివరం	సంఖ్య	రూపాయలు
1.	ఒనిడా కలర్ టెలివిజన్	1	15000
2.	గంగా సీలింగ్ ఫ్యాన్స్	4	4000
3.	యల్.జి. రిఫ్రిజిరేటర్	1	15000
4.	మిక్సీ	1	1500
5.	వెట్ గ్రైండర్	1	8000
6.	ప్లాస్టిక్ చైర్స్	4	2000
7.	ఇనుప బీరువాలు	2	16000
8.	బ్లూస్టార్ ఏసి కండిషనర్	1	20000
	మొత్తం విలువ		81500

డి.హెచ్.ఆర్. విలువ రూ.93,000/-
అమీన్ విలువ రూ.81,500/-
జె.డి.ఆర్. విలువ తెలిపిందు
వేలం తేది.08-09-2025
కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం

మోపర్ల సత్యకృష్ణ
డి.హెచ్.ఆర్. తరపు న్యాయవాది
జంపా వారి వీధి, నరసాపురం
సెల్: 9866259514

BEFORE THE MOTOR ACCIDENTS CLAIM TRIBUNAL-CUM- I ADDL. CHIEF JUDGE: CITY CIVIL COURT AT: SECUNDERABAD
O.P. No. 565 of 2024

Between:
Inapanuri Ravi Teja ... Petitioner
And
Mr. Goudimetla Saichandu & Others ... Respondents
To
2. Mr.Vakada Jeevan Sai Kiran, S/o. Ramana, Aged: Major, Occupation: Business R/o. D. No. 3-47-19, Housing Board Colony, Tadepalligudem Village & Mandal, West Godavari District, A.P. State-534101.

NOTICE

Please take notice that in the above matter the petitioner had filed case against you Respondents No.2 for compensation for Rs.8,00,000/- and the same is posted for your appearance on 07-10-2025.

You are advised to appear on 07-10-2025 at 10-30 a.m. before the said court either in person or through an Advocate failing which, the case will be decided exparte.

(BY THE ORDER OF THE COURT)
M/s. CHINTALA YADAIAH
R. ANJAIAH, CH. RAJU, D. SRIVIDHYA
Advocates
23-78/11, 15 th cross, R. K. Nagar, Anandbagh, Malkajgiri,Hyderabad-47.
Date:29-08-2025
Place: Hyderabad. 9849269006,9701814442

IN THE COURT OF THE CIVIL JUDGE (SENIOR DIVISION) TADEPALLIGUDEM
FDP.No.4/2024 in I.A.No.286/2024 in O.S.No.121/2010

Between:
1.Manepalli Satyanarayna Murthy and Other ...Petitioner/Plaintiffs
And
1.Manepalli Gavaraju & Others ...Respondents/Defendants
To.
Respondent No.3:
Manepalli Anjaneyulu, S/o.Venkata Ratnam, Aged 60 Yrs, Business, Pydiparu.

పై నెంబరు Final Decree పిటీషనులో శ్రీకోర్టు వారు R3 (Respondent) నకు నోటీసులు పంపించినప్పటికిని మీరు తీసుకొనకుండా కాలయాపన చేస్తున్నందున శ్రీకోర్టు వారు through Substituted Service ద్వారా పేపరు పబ్లికేషన్ ఆర్డరు చేసినందున ఈ పబ్లికేషన్ ద్వారా నోటీసు అమలు నిమిత్తం ది.01-09-2025 తేదిన ఉదయం 10.30 గం॥లకు లగాయతు పై కోర్టులో హాజరు కావలెను. లేనియెడల పార్టీయాలుగా తీర్మానించబడును యందు మాలుమూగా తెలియజేయడం అయినది.

Thota Rambabu
Advocate,
Tadepalligudem
Vijaya Tower
Tadepalligudem
Cell: 9848377437
Dt.16-08-2025